




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 347 శనివారం 14-12-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..




- పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణమే ఇవ్వండి
- ఏపీ నుండి వచ్చే రూ.408 కోట్లను ఇప్పించండి
- రూ. 2,547.07 కోట్ల రికవరీ ఆదేశాలు ఏకపక్షంగా ఉన్నాయి
- మరోసారి సమీక్షించి కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి
- నిర్మలా సీతారామన్ ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని వినతి
- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ
- పెండింగ్ రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చ
- కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీకై విజ్ఞప్తి

## నిధుల విడుదలలో కేంద్రం

# చొరవ చూపాలి

**న్యూఢిల్లీ,డిసెంబర్13:** తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం చొరవ చూపాలని సీఎం ప్రత్యేకంగా కేంద్రాన్ని కోరారు. రాజస్థాన్ పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. ప్రధానంగా తెలంగాణ నిధులు, రైల్వే ప్రాజెక్ట పూర్తి, పలు అంశాలపై సీఎం రేవంత్ సుధీర్ఘ చర్చలు జరిపారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ కాగా, పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చించారు. అందులో కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, వికారాబాద్ %-% కృష్ణ స్టేషన్ల మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలుమార్గం నిర్మించాలని కోరారు.

అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో భేటీ కాగా కీలక అంశాలపై చర్చ సాగింది. వెనక బడిన జిల్లాలకు పునర్విభజన చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులను వెంటనే తెలంగాణకు విడుదల చేసేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. నాలుగేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లను ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పించాలని కేంద్రాన్ని కోరారు.విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుండి ఏకపక్షంగా రూ. 2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్ష ఆదేశాల పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు సీఎం. అలాగే ఈ విషయంలో మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రాన్ని కూడా సీఎం అందజేశారు. అయితే కేంద్రాన్ని సీఎం కోరగా, సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా తెలంగాణ పట్ల వివక్షత చూపకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు త్వరితగతిన అందేలా చూడాలని సీఎం కోరారు. సీఎం వెంట తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కూడా భేటీలలో పాల్గొని తమ వాణి వినిపించారు.

## రైతులకు ఆర్బీఐ

# శుభవార్త

**రైతులకిచ్చే రుణ పరిమితి పెంపు**

**రూ1.60 లక్షల నుంచి రూ.2లక్షల పరిమితిని పెంపు**

**ఉత్తర్వులు జారీచేసిన ఆర్బీఐ**

**న్యూఢిల్లీ,డిసెంబర్13:** రైతులకు ఆర్బీఐ శుభవార్త తెలిపింది. వ్యవసాయ అవసరాలకు, పంటల సాగుకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకులు ఇవ్వాల్సిన గరిష్ఠ రుణ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ1.60 లక్షల నుంచి రూ.2లక్షలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే నెల ఒకటిలోగా ఈ ఆదేశాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమల్లోకి తీసుకురావాలని ఆదేశించింది. రుణ పరిమితి పెంచినట్లు రైతులందరికీ తెలిసేలా అన్ని మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపింది.వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టేవారికి కూడా ఈ పెంపుదల వర్తిస్తుందని పేర్కొంది. పంటల సాగుకు రైతులు పెడుతున్న వ్యయం, ద్రవ్యోల్బణం పెరుగుదలను పరిశీలిస్తూ ఆర్బీఐ ఈ పరిమితిని పెంచుతూ వస్తోంది. 2004లో ఈ రుణం పరిమితి కేవలం రూ.10వేలే ఉంది. 20ఏళ్ల వ్యవధిలో రైతులకు పంట సాగు ఖర్చులు 20 రేట్లు పెరిగినట్లు అర్థమవుతుందని సీనియర్ బ్యాంకు ఉన్నాతాధికారి ఒకరు ఈటీవీ భారత్‌కు తెలిపారు.సాధారణంగా భూయజమానులు పంట సాగుచేసినా సాగుచేయకున్నా బ్యాంకుల నుంచి పంటరుణం తీసుకుంటున్నారన్నారు. ఇందుకు ఎలాంటి పూచీకత్తును బ్యాంకులు తీసుకోవద్దని ఆర్బీఐ స్పష్టం చేసింది. అయినప్పటికీ కొన్ని బ్యాంకులు పాస్? పుస్తకాలను పూచీకత్తు కింద పెట్టుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 30శాతానికి పైగా భూములను యజమానులు కౌలుకు ఇస్తున్నారు. కౌలుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉండవనే కారణంగా బ్యాంకులు వారికి పంటరుణాలు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో పూచీకత్తు అడగకుండానే పంటల సాగుకు రుణం ఇవ్వాలని ఆర్బీఐ ఎప్పటికప్పుడు ఇలా ఆదేశాలిస్తున్న చాలా బ్యాంకులు ఈ విషయాన్ని అమలు చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తాకట్టు లేకుండా కౌలు రైతులకు పంటరుణాలు అందక, ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని ఆర్థికభారంతో నలిగిపోతున్నారని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ఈటీవీ భారత్‌తో అన్నారు. వారికి కూడా పూచీకత్తు లేకుండా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకులను కోరినట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మాదిరిగా ఎంతమందికి రుణాలు ఇచ్చారని కమిషన్‌కు వివరాలు అందజేయాలని బ్యాంకులను కోరినట్లు వివరించారు. భూమి ఉన్నా లేకున్నా వ్యవసాయ సంబంధ వ్యాపారం చేయాలి అనుకుంటే లేదా అగ్రి క్లినిక్ ఏర్పాటు చేయదలుచుకుంటే తాకట్టు లేకుండా రూ.5లక్షల వరకూ లోన్ ఇవ్వాలని 2004 మే 18న రిజర్వ్? బ్యాంకు ఆదేశాలిచ్చింది. అగ్రి క్లినిక్ అంటే పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలను రైతులకు ఇవ్వడమేకాకుండా వ్యవసాయనికి అవసరమైన అధునాతన సామగ్రిని విక్రయించడానికి నిరుద్యోగులు ఏర్పాటు చేసుకునే వ్యవసాయ సేవా సంస్థ. ఇలాంటి సేవా సంస్థలు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నాయి. నిరుద్యోగులు అటు రైతులకు సేవలందిస్తూ ఇటు స్వయం ఉపాధి పొందుతున్నారు. తెలంగాణలో బ్యాంకులు పూచీకత్తు లేకుండా ఈ రుణాలను ఇవ్వకపోవడం వల్ల వీటిని ఏర్పాటు చేయడం నిరుద్యోగులకు సాధ్యపడటం లేదని అధికారులు తెలిపారు.

## సభలో ప్రియాంక

# స్పీచ్ అదుర్స్

**నాకన్నా బాగా మాట్లాడిందంటూ..రాహుల్ కితాబు**

**న్యూఢిల్లీ,డిసెంబర్13:** వయనాడ్ ఎంపీగా గెలిచి లోక్‌సభలో తొలిసారి అడుగుపెట్టారు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా. తాజాగా రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా సభలో ఆమె తొలి ప్రసంగం చేశారు. దీనిపై ఆమె సోదరుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక స్పీచ్ బాగుందంటూ ప్రశంసలు కురిపించారు. చాలా విషయాలపై ఆమె అద్భుతంగా మాట్లాడారని అన్నారు. ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఇందులో విపక్షాల తరఫున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా



(ఖసతాజీసీజీ ఉజీనిటరతి) చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె అధికార భాజపా, అరెస్సెస్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. ఒక వ్యక్తి కోసం 142 కోట్ల మంది ప్రయోజనాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చాలని భాజపా ప్రయత్నించిందని, కానీ, లోక్‌సభ ఫలితాలతో (అధికార పార్టీకి భారీ మెజార్టీ రాకపోవడాన్ని ఉద్దేశిస్తూ) ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ రూల్ బుక్ కాదని మండిపడ్డారు.

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

**ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా**

**జర్నలిస్టుపై దాడి ఘటనలో కేసు నమోదు**

**హైదరాబాద్,డిసెంబర్ 13:** నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్?పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు



న్యాయస్థానం తిరస్కరించింది. జల్?పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద జరిగిన ఘర్షణపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా, తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన పిటిషన్ వేశారు. అయితే మోహన్‌బాబు అభ్యర్థనను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

## పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదు

**ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి**

**న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు**

**హైదరాబాద్,డిసెంబర్ 13:** హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.



వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్ చేశారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

# పుష్ప హీరో అల్లు అర్జున్ అరెస్ట్



**తొలి సమయం, హైదరాబాద్,డిసెంబర్13** హైదరాబాద్‌లో హైడ్రామా చోటుచేసుకుంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో డిసెంబర్ 4న రాత్రి పుష్ప 2 ది రూల్ చిత్రం బెనిఫిట్ షో నేపథ్యంలో అల్లు అర్జున్ రాక సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి (39) అనే మహిళ మృతి చెందగా. ఆమె కుమారుడు శ్రీతేజ్ (9)కు గాయాలైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌పై ఇప్పటికే నమోదు చేయగా.. తాజాగా ఈ కేసులో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. ఈ మేరకు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పీఎస్‌కు తీసుకెళ్లారు. ఉదయం అల్లు అర్జున్ ఇంటికి చేరిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసేందుకు రాగా, తండ్రి అల్లు అరవింద్ పోలీస్ జీపు ఎక్కేందుకు యత్నించారు. అయితే తండ్రిని ఆయన వారించారు. తానే వెళతానని వెళ్లారు. డ్రెస్ మార్చుకునేందుకు కూడా పోలీసులు సమయం ఇవ్వక పోవడంతో అల్లు అర్జున్ అసహనం వ్యక్తం చేశారు.

# హైడ్రాతో స్థానికుల్లో ఆందోళన

**చావులకు రేవంత్‌రెడ్డి బాధ్యుడు : కేటీఆర్**

**తొలి సమయం హైదరాబాద్, డిసెంబర్ 13 :** మూసీ పరివాహక ప్రాంతంలో కూల్చివేతల భయంతో ఆటో డ్రైవర్ రవీందర్ హఠాన్మరణం చెందిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చావుకు కారణం నువ్వు.. నీ హైడ్రా బుల్డోజర్లు కారణం కాదా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. హైడ్రాతో పేదల్లో భయం నింపింది.. పేదల గూడులను కూల్చమన్నది నువ్వు కాదా అని నిలదీశారు. డీపీఆర్ లేదంటూనే ఇళ్ల మీద మార్కింగ్‌లు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది నువ్వు కాదా అని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. బుచ్చమ్మ అకాల మరణానికి బాధ్యుడివి నువ్వే.. రవీందర్ గుండెను ఆపింది నీ హైడ్రా బుల్డోజర్లే అని మండిపడ్డారు. అమాయకులను బలితీసుకుని.. వారి బతుకులను ఛిద్రం చేసి, వాళ్ల కుటుంబాలను చిన్నాభిన్నం చేసి, వారి గుండెలను ఆపేసిందన్నారు. తన ఇంటిని కూల్చివేస్తారని దిగులు చెందిన ఆటోడ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన రామంతాపూర్‌లో చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. రామంతాపూర్ లక్ష్మీనారాయణకాలనీకి చెందిన రవీందర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూసీ కూల్చివేతల్లో భాగంగా తమ ఇంటిని కోల్పోతామని కొద్దిరోజులుగా దిగాలుగా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రోజూ మాదిరిగానే గురువారం నాగోల్ నుంచి ఇంటికి వస్తుండగా గుండెపోటు రావడంతో రవీందర్ మృతిచెందాడు. తన ఇంటిని కూల్చివేస్తారనే ఆవేదనతోనే మరణించినట్టు కుటుంబసభ్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుండెపోటుతో రవీందర్ మృతి చెందిన విషయం సోషల్ మీడియాతోపాటు స్థానిక గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది.

## అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై విపక్షాలు

# అభిశంసన తీర్మానం

**వీహెచ్‌పీ కార్యక్రమంలో వివాదస్పద వ్యాఖ్యల నేపథ్యం**

**రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేత**

**అలహాబాద్,డిసెంబర్ 13:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టాయి. ఇటీవల జరిగిన వీహెచ్?పీ కార్యక్రమంలో ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ సెక్రటరీ జనరల్?కు నోటీసును అందించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్?పై అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించడానికి సంబంధించిన నోటీసుపై కపిల్ సిబల్, దిగ్విజయ్ సింగ్, జాన్ బ్రిట్టాస్, మనోజ్ కుమార్ ఝా, చిదంబరం, రణ్ దీప్ సుర్జేవాలా, ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, ముకుల్ వాస్నిక్, నాసీర్ హుస్సేన్, రాఘవ్ చద్దా, సంజయ్ సింగ్, రేణుకా చౌదరి సహా 55 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేశారు. వీరందరూ కలిసి రాజ్యసభ సెక్రటరీ జనరల్ ను సభా కార్యక్రమాలు ప్రారంభానికి ముందు కలిశారు. ఈ క్రమంలో అభిశంసన నోటీసును అందజేశారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం 1968, రాజ్యాంగంలోని ఆర్టికల్ 218 కింద ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసును సమర్పించారు. విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని నోటీసులో విపక్ష సభ్యులు ఆరోపించారు. ద్వేషపూరిత ప్రసంగం, మత సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. న్యాయమూర్తి మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారని, వారిపై పక్షపాతం చూపించారని తెలిపారు. "జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించిన విషయాలపై రాజకీయంగా మాట్లాడారు. బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇలా చేయడం న్యాయవ్యవస్థను ఉల్లంఘించినట్లే. జస్టిస్ శేఖర్ కుమార్ చేసిన బహిరంగ వ్యాఖ్యలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. అలాగే పక్షపాతంతో కూడుకున్నవి" అని నోటీసులో పేర్కొన్నారు. "దేశంలోని మెజారిటీ ప్రజల ఇష్టానికి అనుగుణంగా భారత్ పనిచేస్తుందని జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(ఈ) కింద పొందుపరచిన ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించారు. ఆయన వ్యాఖ్యలు వివిధ మతాలు, మత సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి. రాజ్యాంగంలోని లౌకిక నీతిని ఉల్లంఘిస్తున్నాయి. ఈ నోటీసును ఆమోదించాలని రాజ్యసభ ఛైర్మన్ ను విజ్ఞప్తి చేస్తున్నాం. 1968 న్యాయమూర్తుల (విచారణ) చట్టం ప్రకారం భారత రాష్ట్రపతికి ఈ నోటీసును పంపాలి. ద్వేషపూరిత ప్రసంగం, న్యాయ ఉల్లంఘనల ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని రాజ్యసభ ఛైర్మన్ ను అభ్యర్థిస్తున్నాం. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ కు తొలగించాలి. " అని అభిశంసన నోటీసులో విపక్ష సభ్యులు పేర్కొన్నారు.

# షటిల్ బ్యాట్మెంటన్ అకాడమీ ఏర్పాటు చేస్తా

**- బ్యాట్మెంటన్ క్రీడాకారుడు భగవాన్ రెడ్డి**

**- స్టేడియం, డే కేర్ సెంటర్ లో ఘనంగా భగవాన్ రెడ్డి జన్మదిన వేడుకలు**

**తొలి సమయం కరీంనగర్ డిసెంబర్, 13**
మూడు దశాబ్దాలుగా షటిల్ బ్యాట్మెంటన్ రంగానికి విశేష సేవలందిస్తూ వచ్చిన వి.భగవాన్ రెడ్డి వచ్చే జనవరి నుండి షటిల్ బ్యాట్మెంటన్ అకాడమీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ అకాడమీ ద్వారా యువతకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, టోర్నమెంట్లు నిర్వహిస్తామని వెల్లడించారు.కరీంనగర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం తన జన్మదినోత్సవ సందర్భంగా స్వంత ఖర్చులతో షీల్డులు బహుకరించారు. షటిల్ బ్యాట్మెంటన్ క్రీడాకారునిగా, అనేక టోర్నీలు నిర్వహించిన వ్యక్తిగా, ఆయన సేవలను గుర్తించిన టోర్నమెంట్ నిర్వాహకులు భగవాన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని స్టేడియం ఆవరణలో ఘనంగా నిర్వహించి సత్కరించారు. వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు గసిగంటి జనార్దన్ రెడ్డి,తుమ్మల రమేష్ రెడ్డి,మట్ట ప్రభాకర్ రెడ్డి, గుంటపల్లి స్వామి తదితరులు షటిల్ బ్యాట్మెంటన్ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం జడ్పీ క్వాటర్స్ లో సీనియర్ సిటిజన్స్ డేకేర్ సెంటర్ ఆధ్వర్యంలో భగవాన్ రెడ్డి దంపతులను వందమందికిపైగా సీనియర్ సిటిజెన్లు ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా భగవాన్ రెడ్డి డేకేర్ సెంటర్ అభివృద్ధికి తనవంతుగా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సెంటర్ కార్యదర్శి కేశవ రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో



భగవాన్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సంఘం బాధ్యులు కేశవరెడ్డి, సత్యనారాయణ, వి రామేషం, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం.అంజయ్య, ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్ల ఫెడరేషన్ నేషనల్ సెక్రెటరీ వైయస్ శర్మ, రిటైర్డ్ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజంలో వృత్తి విలువల పెంపుదల కోసం కృషి చేయాలి

**డబ్ల్యూ జేఐలో చేరిన చిగురుమామిడి మండల పాత్రికేయులు**

**తొలి సమయం కరీంనగర్ డిసెంబర్ 13:**
జర్నలిజం వృత్తిలో నానాటికి విలువలు దిగజారి పోతుండడం పట్ల బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తి విలువల పెంపుదల కోసం నవతరం పాత్రికేయులు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన 15 మంది విలేకరులు వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియాలో చేరారు.ఈ సందర్భంగా వారికి స్వాగతం పలుకుతూ విలేకరులు కేవలం వార్త సేకరణకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకం కావాలనిసూచించారు.జర్నలిజం రంగంలోకి కొత్తగా వస్తున్న వారికి వృత్తి శిక్షణతో పాటు, డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర , రక్త నిర్ధారణ పరీక్షల శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.జర్నలిస్టు సంఘాలకు సంఖ్యా బలమే ముఖ్యం కాదని, నిజాయితీతో, నిబద్ధతతో, పనిచేసే జర్నలిస్టులకు డబ్ల్యూజేఐ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని చెప్పారు.నూతన సంవత్సరంలో డబ్ల్యూజేఐ కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసమే నిరంతరం పనిచేసే నాయకత్వం వెంట జిల్లాలోని జర్నలిస్టులు అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా జర్నలిస్టులకు నిరంతరం తాము అండగా ఉంటామని, వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తామని,వారి కష్ట,సుఖాల్లో భాగస్వాములు అవుతామని తెలిపారు. జర్నలిస్టుల వసుదైక కుటుంబం తమలక్ష్యమని, ఆ లక్ష్యసాధనలో జిల్లాలోని జర్నలిస్టులందరూ



భాగస్వాములు అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.గురువారం చిగురుమామిడి ప్రెస్ క్లబ్ (రిజిస్టర్డ్ నెంబర్ 347/2024) అధ్యక్షుడు చిట్టంపల్లి శ్రీనివాస్ ( నవతెలంగాణ), ప్రధాన కార్యదర్శి రాకం కరుణాకర్ ( దిశ) ల ఆధ్వర్యంలో కే బాలయ్య (సాక్షి), పత్తెం రమేష్ (వార్త), మారుపాక రమేష్( ప్రజా సాక్షి ), ఎలగందుల రవీందర్ ( తెలుగు ప్రభ),తాళ్ల నరేష్ ( సిరా న్యూస్ ),గుడికందుల దేవదాస్ (అక్షరం),బోయిన సంపత్ (వాస్తవం ),బొల్లబత్తిని మహేష్ (ప్రజా దర్బార్ ) ముంజ శ్రీకాంత్ ( అక్షర విజేత) తదితరులు డబ్ల్యూజేఐ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జిల్లా నాయకులు టి సత్యనారాయణ, దారం జగన్నాథ రెడ్డి, ఆడెపు లక్ష్మీనారాయణ, డిఎస్ ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 19 ఇందిరాపార్క్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

**గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్**

**తొలి సమయం తొర్రూరు డిసెంబర్13**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గొల్ల కురుమలకు రెండో విడత గొర్ల పంపిణీ చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిసెంబర్ 19న ఇందిరాపార్క్ వద్ద గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం (జిఎంపిఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాను గొల్ల కురుమలు గొర్రెల పెంపకం దారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిఎంపిఎస్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలోని జిఎంపిఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మొదటి విడత పంపిణీ చేసి రెండో విడత పంపిణీ చేయకుండా మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గొల్ల కురుమలు అధిక మెజారిటీతో గెలిపించుకున్నారని ఎన్నికల హామీగా రెండో విడత పంపిణీ చేస్తానని చెప్పి ఏడాది గడిచినా కూడా నేటికీ రెండో విడత గొర్ల పంపిణీ చేయకుండా గొల్ల కురుమలను విస్మరించిందని విమర్శించారు. గత ప్రభుత్వమే విస్మరించిందని ఈ ప్రభుత్వాన్ని గెలిపిస్తే దొందూ దదే అన్న తీరుగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండో విడత గొర్రెల పంపిణీగా లబ్ధిదారుల వ్యక్తిగత అకౌంట్లోకి 2 లక్షల రూపాయల నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో ప్రజాభవన్ ముట్టడి చేయడానికి కూడా వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




మహబూబాబాద్ జిల్లాలోని గ్రామాల సొసైటీ అధ్యక్షులు గొర్ల కాపర్లు గొల్ల కురుమలు డిసెంబర్ 19న ఇందిరాపార్క్ ముందు నిర్వహించే ధర్నాను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మనబోయిన యాకయ్య, తొర్రూరు మండల అధ్యక్షులు ఎద్దు ఐలయ్య, జిఎంపిఎస్ నాయకులు చేను రామకృష్ణ, సర్వి నాగరాజు, గజ్జి యాకయ్య, బొమ్మసాని అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

**డోర్నకల్ ఎమ్మెల్యే మాటల వక్రీకరణ మార్ఫింగ్**

# వీడియో పై ఎస్పీ కి ఫిర్యాదు

**ట్రోల్ చేసిన వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పితీరుతాం**

**కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం**

**గౌడ్, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్**

**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 13:**
శీతాకాల అసెంబ్లీ సమావేశాలలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మాటతీరును కొంతమంది బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించి దానిని యూట్యూబ్ లో , ఇతర సోషల్ మీడియాలలో ప్రచారం చేయడం జరిగింది. ఈ తీరును కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ లు తీవ్రంగా ఖండించారు . ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... రామచంద్రునాయక్ విద్యావేత్త అన్నారు. మృదు స్వభావి అన్నారు ఆయన మాట్లాడే ప్రతి మాట అందరికి అర్థం అయ్యే విదంగా చక్కగా మాట్లాడుతారు అన్నారు సామాజిక బాధ్యత తో కూడిన ఉపన్యాస ధోరణి ఉంటుంది అన్నారు అసెంబ్లీ లో గత పాలకులు దోపిడీ అవినీతి గురించి మాట్లాడిన తీరును, వక్రీకరించడం చాలా సిగ్గుచేటుని తెలిపారు కావాలని



కొంతమంది బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పై బురద చల్లే ప్రయత్నం లో చిల్లర ట్రిక్స్ ప్లే చూస్తున్నారన్నారు.మార్ఫింగ్ వీడియోకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ఇలాంటి పెయిడ్ యూట్యూబర్ లను, సోషల్ మీడియా వ్యక్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, కురవి టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్ కుమార్, కురవి మండల యూత్ అధ్యక్షుడు డాక్టర్ దడిగల శరత్, కురవి మండల ఉపాధ్యక్షులు బాలగాని శ్రీనివాస్, కురవి ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్ రెడ్డి, , మండల ఉపాధ్యక్షులు దయ్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్చిన హామీలను అమలు చేయడంలో**

# రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

**సీపీఎం తొర్రూరు మండల కార్యదర్శి ఎండీ యాకూబ్**

**అమ్మపురంలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమం**



**తొలి సమయం తొర్రూరు డిసెంబర్ 13**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి 6 గ్యారంటీలలోని హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం తొర్రూరు మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తొర్రూరు మండలం అమ్మపురం గ్రామంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు డొనుక దర్గయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సర్వేలో ప్రజలను పది సంవత్సరాల గత ప్రభుత్వ పాలకులు ఈ నూతన ప్రభుత్వ పాలకులకు తేడాలు ఏమైనా ఉన్నాయని ప్రజలను అడుగగా గ్రామంలో సైడు కాలువలు, వృద్ధాప్య, వితంతు పెన్షన్, నూతన రేషన్ కార్డులు గృహలక్ష్మి పథకంలోని ప్రతి మహిళకు 2500 రూపాయల ఇస్తామని చెప్పి ఒక్క ఫ్రీ బస్సు మాత్రం వర్తింప చేశారని అది మేము కూలి చేసుకుంటే గాని బ్రతకలేని స్థితిలో మేముంటే ఊర్లు తిరిగే సమయం మాకు ఎక్కడ ఉందని... ఫ్రీ బస్సు పథకం కూడా డబ్బులు ఉన్నవారికి ఉద్యోగస్తులకే ఎక్కువగా ఉపయోగపడుతుందని అన్నారు. ఎక్కువగా ఏ ప్రభుత్వం వచ్చినా అన్ని ఉన్న వారికే పథకాలు అందజేస్తున్నారని అసలు భూమిలేని వారితో పాటు కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వాలు ఏమీ ఇవ్వడం లేదని... అంతేకాకుండా వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇస్తానని చెప్పి నేటికీ ఆ హామీ ఊసేత్తకుండా కాలయాపన చేయడం సరి కాదని వెంటనే ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని అన్నారు. గ్రామంలో గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో ఇల్లు లేని ఏ ఒక్కరికి ఇల్లు మంజూరు చేయలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వమైన ఇండ్లు మంజూరు చేస్తుందని ఆశతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించామని ఇండ్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి రెండు పడక గదుల ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు లబ్ధిదారునికి ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ ఇంటింటికి సీపీఎం కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొమ్మన బోయిన యాకయ్య, దొమ్మటి సోమయ్య, ధరావత్ ప్రవీణ్, డొనుక యాకాంత వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కురవి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఔదార్యం

**బాలపాల గ్రామనికి చెందిన చిన్నారులు**

**సుమలత, నాగమణి 20000 రూపాయిల సహాయం అందజేత**

**తొలి సమయం కురవి డిసెంబర్ 13:**



మీడియా కథనాల ద్వారా తల్లి తండ్రులు చనిపోయి ఆర్థికంగా ఏమి లేక అమ్మమ్మ దగ్గర ఉంటున్న చిన్నారుల బాధ తెలుసుకున్న కురవి పోలీస్ సిబ్బంది అందరు కలిసి 10000 రూపాయిలు సహాయం చేయగా, ఎస్సై సతీష్ 10000 రూపాయిలు సహాయం అందిచడం తో మొత్తం కలిపి 20000 రూపాయిలు ను వారి బ్యాంకు అకౌంట్స్ లో ఫిక్స్ డిపాజిట్ చేసి బలపాల గ్రామం చిన్నారుల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి, వారికీ దయిర్యం చెప్పి వారికి ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్స్ మరియు ఫ్రూట్స్ అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రంలో ఏ ఎస్సై సదయ్య, ఏ ఎస్సై వెంకన్న, హెచ్ సి వెంకటయ్య,పీసీ బద్రు, రమేష్, పీసీ కాశీరం,పీసీ యాకేష్,డబ్ల్యూ పీసీ శ్రావణి గ్రామ పెద్దలు వెంకటనారాయణ, పాల్గొన్నారు

# వైసీపి నాయకుడు అవినాష్‌రెడ్డి అరెస్టు

**అమరావతి,డిసెంబర్ 13:** కడప పార్లమెంట్ సభ్యుడు, వైసీపీ నాయకుడు అవినాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సాగు నీటి సంఘాల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాలలో వైసీపీకి చెందిన రైతులకు నో డ్యూస్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రైతులతో పాటు అవినాష్ రెడ్డి వేముల తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ అప్పటికే టీడీపీకి చెందిన రైతులు ఉండడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముందుజాగ్రత్తగా పోలీసులు అవినాష్ రెడ్డిఅదుపులోకి తీసుకొని వేముల పోలీస్‌స్టేషన్‌కు అక్కడి నుంచి పులివెందులకు తరలించారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్న రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని భావించి రైతులకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు వచ్చి ప్రజాస్వామ్యబద్దంగా ఓటు వేయడానికి వస్తే పరాభవం ఎదురవుతుందనే భయంతో పోలీసులను అడ్డుపెట్టుకుని దద్దమ్మ రాజకీయాలు ఆడడం సిగ్గుగా లేదాని ప్రశ్నించారు. అధికారులను అడ్డం పెట్టుకొని తప్పుడు రాజకీయాలు చేయడం క్షమించరాని తప్పని పేర్కొన్నారు . ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేకపోతే సాగునీటి సంఘాలకు నామినేటెడ్ పదవుల మాదిరి చేసుకుంటే సరిపోయేదని. ఈ మాత్రం దానికి ఎన్నికలని పేరు పెట్టడం దేనికని ప్రశ్నించారు.

# రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆదేశాలు

**అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలి**

**అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుంది**

**సంక్షేమ పథకాలపై అవగాహనను పెంచాలి**

**పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని ఝాన్సీ రెడ్డి**

**ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



**తొలి సమయం తొర్రూరు డిసెంబర్ 13:**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పనిచేయాలని. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని ఝాన్సీ రెడ్డి, మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు అన్నారు.. పాలకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి మండలం లోని వివిధ గ్రామాల నాయకులతో కలిసి మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు కార్యకర్తలు చురుగ్గా పాల్గొనే విధంగా నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అంకితభావంగా పనిచేసే కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని విష నిర్దేశం చేయాలని నాయకులను మోటివేట్ చేశారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు.సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోక అవగాహనను పెంచాలని అన్నారు.. గెలుపే లక్ష్యంగా భవిష్యత్తులో జరగబోయే స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో పని చేయాలని అన్నారు శాసన సభ్యురాలు యశశ్విణి ఝాన్సీ రెడ్డి అన్నారు . పేదలను ఉద్దేశించి ఇచ్చే సంక్షేమ పథకాలపై అవగాహనను పెంచే విధంగా నాయకులు చొరవ తీసుకోవాలని హితవు పలికారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి మంజుల భాస్కర్ బ్లాక్ అద్యక్షులు తప్పక సత్యనారాయణ మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి సీనియర్ రాఘవరావు ముఖ్య నాయకులు గ్రామ ముఖ్య నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఆదివాసీలకు చేయూత నిచ్చిన రెడ్ క్రాస్ సొసైటీ

**- కార్లాయి, వీరంపేట గ్రామాలకు మనవీయ సహాకారం - దుప్పట్లు,టార్పలిన్ లు అందజేత**



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 13**
గూడూరు మండలం మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు సులు వీరంపేట ఆదివాసీలు మరియు కార్లాయి ఆదివాసీల ఇండ్లు ఇటీవల కురిసిన కాల వర్షాల కారణంగా కురుస్తున్నాయి. తమకు టార్ఫలిన్లు అందజేయాలని రెడ్ క్రాస్ సొసైటీ ని కోరారు వెంటనే స్పందించిన హైదరాబాద్ బాద్ రెడ్ క్రాస్ సొసైటీ, మహబూబాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ శాఖకు టార్పాలిన్స్ తో అదనంగా చలికాలంలో కప్పుకోవ డానికి దుప్పట్లను అందజేశారు.. గూడూరు మండలం రెవిన్యూ అధికారుల సహాయంతో లబ్ధిదారులను గుర్తించి వీరంపేట ఆదివాసీలకు 52 దుప్పట్లు 52టార్పాలిన్స్, అదేవిదంగా కార్లాయి గ్రామానికి 45 టార్పలిన్స్ మానుకోట శాఖ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందజేశామని మహాబాద్ శాఖ తెలియజేసింది ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి వరప్రసాద్ కోశాధికారి మాధవపేది వెంకటరెడ్డి. సభ్యులు కట్ల వెంకన్న, సుధాకర్ టీచర్ గ్రామ ప్రముఖులు. మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. మా అభ్యర్థనకు స్పందించి మా అవసరాలను తీర్చిన రాష్ట్ర మరియు మహబూబాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖ వారికి వీరంపేట మరియు కార్లయి ఆదివాసి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## వీరభద్ర స్వామి ఆలయ నూతన చైర్మన్‌గా

# కొర్ను రవీందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం







**తొలి సమయం, మహబూబాబాద్ డిసెంబర్ 13:**
జిల్లాలోని అతిపెద్ద దేవాలయం కురవి మండలంలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఆలయ మండపంలో అట్టహాసంగా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆర్.సమత నేతృత్వం లో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులు అందరు ప్రతిజ్ఞ చేశారు. సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో ఆలయ చైర్మన్ ను ఎన్నుకున్నారు.అనంతరం ఆలయ చైర్మన్ గా దేవస్థానం సన్నిధి లో గలచైర్మన్ కార్యాలయంలో వేద పండి తుల మంత్రోత్సవాల నడుమ వేదాఆశీర్వాదాలతో దేవస్థానం కార్యనిర్వాహ ణాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన కొర్ను రవీందర్ రెడ్డి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు,గ్రామ ప్రజలు, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్,చందు నాగన్న, నజీర్, ఇరుగు వెంకన్న,ఉపేందర్, కోర్ను కృష్ణారెడ్డి,నూకల మల్లయ్య దిలీప్, జనార్ధన్, మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి,బండి శ్రీను, గుండ్రాతిమడుగు సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి,తదితరులు ఘనంగా సత్కరించారు.

# రాష్ట్ర స్థాయి గణిత పోటీకి వెంపటి విగ్నేష్ ఎంపిక

**కంబాల పెల్లి హై స్కూల్ నుండి వరుసగా 3వ సారి రాష్ట్ర స్థాయి గణితం టాలెంట్ టెస్ట్ కు ఎంపిక**




**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 13:**
జిల్లా స్థాయి గణితం పోటీ పరీక్షలో వెంపటి విగ్నేష్ తృతీయ స్థానం పొంది హైదరాబాద్ లో జరుగబోయే రాష్ట్రస్థాయి గణితం పోటీలో పాల్గొనుటకు అరుదైన అవకాశం లభించినట్లు కంబాలపల్లి హైస్కూల్ హెడ్మాస్టర్ రమేష్ బాబు ఓ పత్రిక ప్రకటనలో తెలియజేశారు..ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ,కంబాల పెల్లి హై స్కూల్ విద్యార్థులు వరుసగా మూడవసారి రాష్ట్రస్థాయి గణిత పోటీల్లో ఎంపిక కావడం అభినందనీయం అని అన్నారు. ఇలాంటి అరుదైన విజయాల వెనుక సబ్జెక్టు ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనిదన్నారు.. కంబాలపెల్లి హై స్కూల్ లోని సబ్జెక్టు ఉపాధ్యాయులు రామ సహాయం శ్రీధర్ రెడ్డి మరియు కాసం శ్రీనివాసరావుల కృషి, పట్టుదల గొప్పదని కొనియాడారు పాఠశాల విద్యార్థి విగ్నేష్ రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి పాఠశాల కు మరియు పుట్టిన గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ ఉప్పలయ్య సోహన్ బి తిరుపతి శోభారాణి సోమేశ్వర్ ఝాన్సీ వెంకటేశ్వర్లు మల్లారెడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు

# నిరుపేదలకు అంతా తానై నిలుస్తున్న ఝాన్సీ రాజేందర్ రెడ్డి

**నిరుపేద పెళ్లి కూతురుకు 25000 ఆర్థిక సహాయం**



**తొలి సమయం తొర్రూరు డిసెంబర్ 13:**
పేదోళ్ల ఇండ్లల్లో ఏ కార్యక్రమం జరిగినా.. నిరుపేద పేద మధ్యతరగతి కుటుంబాలకు అంతా తానై, నేనుంటానని, పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మానావీయ కోణాన్ని నిరూపించుకుంటున్నారు. పాలకుర్తి నియోజకవర్గం చెందిన నిరుపేద కుటుంబం. మారోజు సునీత శంకరాచారి దంపతుల కుమార్తె చిరంజీవి అఖిల వివాహానికి 25వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి దాతృత్వానికి ప్రతీకగా నిలిచారు,శంకరాచారి నిరుపేద మరియు అందుడు అనే సమాచారాన్ని అందుకొని వెంటనే పరుగు పరుగున స్పందించానని జాన్సీ రాజేందర్ రెడ్డి తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. నిరుపేదల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని.. నిరుపేదలకు సహాయము చేయడంలో ఉండే ఆనందానికి, సంతృప్తికి, అవధులు ఉండవన్నారు నియోజకవర్గంలో పేదలు ఎప్పుడు, ఎక్కడ, ఏ విధమైన ఇబ్బందులు పడ్డా నా దృష్టికి తీసుకురావాలని, నిర్భయంగా నాకు తెలియజేయాలనిఅన్నారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యం పట్టణ అధ్యక్షులు నాగన్న పెనుగొండ

## స్వామివారిని దర్శనానికి 24 గంటల సమయం

**తిరుమల,డిసెంబర్ 13:**
కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా 21 కంపార్టుమెంట్లలో స్వామివారి దర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులు దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న స్వామివారిని 61,178 మంది భక్తులు దర్శించుకోగా 22,464 మంది తలనీలాలు సమర్పించు కున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.85 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## స్వర్ణాంధ్ర విజన్-2047 ఆవిష్కరణ

**అమరావతి,డిసెంబర్ 13:**
స్వర్ణాంధ్ర విజన్–2047 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇందిరా గాంధీ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. పెద్దఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమానికి కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరయ్యారు. అంతకుముందు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లో స్వర్ణాంధ్ర ఏ 2047 పై ఏర్పాటు చేసిన స్టాల్‌లను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు సందర్శించారు. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. స్వర్ణాంధ్ర 2047 పది సూత్రాలు.. పేదరికంలేని సమృద్ధికరమైన అవకాశాలు అందించే అద్భుత ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలకు నైపుణ్యాలకు కేంద్రంగా రానున్న రోజుల్లో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఆవిష్కృతమయ్యేలా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చి దిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం రూపొందించిన పది సూత్రాలు స్వర్ణాంధ్రకు మార్గదర్శకాలు. పేదరికం లేని సమాజం, ప్రతి కుటుంబానికి అవసరమైన వనరులు సమకూర్చడం, ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం ఈ సూత్రం ప్రధాన లక్ష్యం. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్.. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ముఖ్య ఉద్దేశం. ఉద్యోగ, ఉపాధి కల్పనతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసేలా స్వర్ణాంధ్ర విజన్ రూపొందించారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు – వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి మరియు ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాలలో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశలలో సమగ్ర సాంకేతికత వంటి 10 సూత్రాలతో విజన్ 2047 రూపొందించారు. స్వచ్ఛాంధ్ర స్టాల్ వద్ద సీఎం చంద్రబాబు ఛలోక్తులు విసిరారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన ఆలోచనలు ఉండాలని సూచించారు. పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారంటూ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. మహిళా రైతులతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఆర్థికాభివృద్ధికి అందుతున్న తోడ్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్‌ను 10సూత్రాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఆక్వా ఉత్పత్తుల రవాణాలో ఇబ్బందులు పరిష్కరించాలని ఆక్వా రైతులు కోరారు.


# ప్రార్థనా స్థలాల చట్టంపై పదేపదే చర్చ ఎందుకు?



**తొలి సమయం హైదరాబాద్,**

భారతదేశం లౌకిక దేశం. పౌరులు స్వేచ్ఛగా తమ మతాలను ఆచరించవచ్చు. మత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడటం ప్రభుత్వాల విధి. అలాగే మతం ప్రాతిపదికన ప్రభుత్వాలు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదు. ఇక, మత స్వేచ్ఛకు సంబంధించిన ఎన్నో చట్టాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖమైనది ప్రార్థనా స్థలాల చట్టం. 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు అస్థిత్వంలో ఉన్న మతపరమైన కట్టడాలు. వాటి గుర్తింపు, స్వభావాన్ని, నిర్మాణాన్ని రక్షించేందుకు ఉద్దేశించిన చట్టం ఇది. మతపరమైన కట్టడాలు అంటే అవి దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారా లు...ఏవైనా కావచ్చు, 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు వాటి స్వరూపం ఎలా ఉందో అలాగే కొనసాగించాలని ఈ చట్టం చెబుతోంది. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామ మంది రం నిర్మించాలని బీజేపీ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమం బలం పుంజుకోవడంతో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో 'ది ప్లేస్ ఆఫ్ వర్షిప్ (స్పెషల్ ప్రొవిజన్స్)' చట్టం తీసుకొచ్చింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ దీనిని గట్టిగా వ్యతిరేకించింది. 1991లో అమల్లోకి వచ్చిన ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు వాటిని విచారిస్తోంది. కాగా, మతపరమైన ప్రార్థనా స్థలాలను సర్వే చేయాలని కోరుతూ కొత్తగా దాఖలయ్యే పిటిషన్లను స్వీకరించరాదని, ప్రస్తుతం విచారణలో ఉన్న పిటిషన్లపై తాత్కాలిక లేదా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని దేశంలోని అన్ని కోర్టులను సుప్రీంకోర్టు తాజాగా ఆదేశిం చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 చెల్లుబాటుపై విచారణ జరిపి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కోర్టులు సంయమనం పాటించాలని తెలిపింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జ్ఞానవాపి, మథుర, సంభల్ సహా 10 మసీదులు, దర్గాలపై హిందూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిలిచిపోయింది. వీటి మతపరమైన అసలు స్వభావాన్ని తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఈ పిటిషనర్లు కోరుతున్నారు. సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 6 పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 నిబంధన లను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రార్థనా స్థలాల చట్టం1991 మీద దాఖలైన పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు చెప్పబోయే తీర్పు మీద దేశంలో ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న డజన్ల కొద్దీ ప్రార్థనాలయాల భవిష్యత్ ఆధారపడి ఉంది. ఇందులో ఎక్కువ భాగం కట్టడాలు ముస్లింలకు చెందినవి. వీటి మీద హిందూ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. కోర్టు కేసుల్లో చిక్కుకున్న వాటిలో జ్ఞానవాపి, షాహి ఈద్గా, వారణాసి, మధురలోని రెండు వివాదాస్పద మసీదులు ఉన్నాయి. రెండు వారాల కిందట అజ్మీర్ దర్గా విషయంలో దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అజ్మీర్‌లో ప్రతిరోజూ వేలమంది సందర్శించే 13వ శతాబ్దానికి చెందిన ఈ సూఫీ మందిరాన్ని హిందూ ఆలయం మీద నిర్మించారని కోర్టులో పిటిషన్ దాఖలైంది. నెల రోజుల కిందట ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ 16వ శతాబ్దానికి చెందిన మసీదులో సర్వే నిర్వహించాలని కోర్టు ఆదేశించడంతో హింస చెలరేగింది. ఇందులో నలుగురు మరణించారు. సర్వే నిర్వహించాలన్న కోర్టు నిర్ణయంపై ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కోర్టులు సర్వేకు ఆదేశాలు జారీ చేసినప్పుడల్లా ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. జ్ఞానవాపి మసీదు విషయంలోనూ ఇదే జరిగింది. 17వ శతాబ్దంలో కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మసీదు నిర్మించారని హిందూ సంఘాలు ఆరోపించాయి. జ్ఞానవాపి మసీదులో సర్వే నిర్వహించాలన్న కోర్టు ఆదేశాలను ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. ఇది 1991 ప్రార్థనా స్థలాల చట్టానికి విరుద్ధమనేది వారి వాదన. అయితే 2022లో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ సర్వేను ఆపాలని చెప్పలేదు. 1947 ఆగస్టు 15నాటికి ఉన్నప్రార్థనాలయాల స్వభావాన్ని మార్చడానికి ప్రయత్నించనంత వరకు, వాటిపై దర్యాప్తును 1991 చట్టం నిరోధించలేదని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. ఈ ఉత్తర్వులను అనేక మంది విమర్శించారు. వివిధ ఆరోపణల వల్ల స్థలాల చారిత్రక స్థితిని నిర్ణయించడం అనేది మతాల మధ్య ఘర్షణలను, హింసను రెచ్చగొట్టే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చట్టాన్ని తొలగించినా లేక బలహీనపరిచినా అది ఇలాంటి అనేక పిటిషన్లకు గేట్లు తెరవడం లాంటిదేనని ప్రతిపక్ష నాయకులు, ముస్లిం సంఘాల నేతలు భావిస్తున్నారు. దీని వల్ల దేశంలో హిందువులు, ముస్లింల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం ఉందని అంటున్నారు.

# శభాష్ గుకేశ్....కల నిజమైంది!




**తొలి సమయం హైదరాబాద్,**

చెన్నైకి చెందిన పద్దెనిమిదేళ్ల గుకేశ్ దొమ్మరాజు ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ సాధించిన అతి పిన్న వయస్కుడిగా అవతరించాడు. దొమ్మరాజు ఇప్పుడు ప్రపంచ చెస్ కింగ్. సింగపూర్ లో జరిగిన టోర్నీలో హోరాహోరీగా సాగిన 14వ రౌండ్ లో డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌ను ఓడించాడు. గుకేశ్ మొత్తంగా 7.5 పాయింట్లతో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. ఇప్పుడు దేశం మొత్తం ఈ కుర్రాడి గురించే మాట్లాడుకుంటోంది. గుకేశ్‌కి ఇది తొలి ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్. గెలిస్తే ఏం చేస్తారని సింగపూర్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నకు.. 'నాకు తెలియదు, ముందుగా సంతోషిస్తాను' అని బదులిచ్చారు గుకేశ్.మరోవైపు, ఢిల్లీ నుంచి గల్లీ వరకు గుకేశ్‌పై అభినందనల వర్షం కురుస్తోంది. ఆయన సాధించిన విజయం చారిత్రకం, అసాధారణం అన్నారు ప్రధాని మోడీ. అతను దేశం గర్వపడేలా చేశాడని.. ఈ విజయం చెస్‌లో శక్తిమంతమైన దేశంగా భారత ముద్రను చాటిందని అభినందించారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. అతిపిన్న వయసులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోవడం ద్వారా దొమ్మరాజు గుకేశ్ చరిత్ర సృష్టించారు. ఆయన తెలుగువాడు కావడం గర్వకారణం. 18 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన తొలివ్యక్తిగా గుకేశ్ నిలిచారు. అతడి ఘనతను యావత్తు దేశం ఆస్వాదిస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి విజయాలు మరిన్ని అందుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షిచారు. ఇంకా ఈ జాబితాలో అనేక మంది ప్రముఖులు ఉన్నారు. ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ , ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, మాజీ సీఎం జగన్ గుకేశ్ కు అభినందనలు తెలిపారు. గుకేశ్ తండ్రి పేరు రజనీకాంత్, ఈఎన్‌టీ సర్జన్‌గా పనిచేసేవారు. కుమారుడికి చెస్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన రజనీకాంత్ 2017లో వైద్య వృత్తిని విడిచిపెట్టారు. గుకేశ్ తల్లి డాక్టర్ పద్మకుమారి మద్రాసు మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్. గుకేశ్ కుటుంబంలో మార్గనిర్దేశర చేయడానికి లేదా ఇన్‌స్పైర్ చేయడానికి చెస్ ప్లేయర్స్ ఎవరూ లేరు, అయినా కూడా ఆటపై అతనికున్న అభిరుచి ఇంత దూరం తీసుకువచ్చింది. మొదటగా ఇంట్లో వారితో చెస్ ఆడటం ప్రారంభించారు గుకేశ్ . అక్కడే బేసిక్స్ నేర్చుకున్నారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను గెలుచుకున్నారు. పని ముగించుకొని తండ్రి స్కూలుకు వచ్చేంత వరకు ఖాళీగా ఉండకూడదని పాఠశాల తర్వాత చెస్ ప్రాక్టీస్ సెషన్ కోసం పేరు నమోదు చేసుకున్నారు గుకేశ్ . అతని ప్రతిభను గుర్తించిన కోచ్ అతనికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అతనికి తల్లిదండ్రులు, పాఠశాల నుంచి మద్దతు లభించింది. స్థానిక టోర్నమెంట్లలో పాల్గొనడం ప్రారంభించారు. బహుమతులు గెలుచుకున్నారు.. 2015లో గోవాలో జరిగిన నేషనల్ స్కూల్స్ చాంపియన్‌షిప్‌ను గెలుపొందిన గుకేశ్, ఆ తర్వాత రెండేళ్లపాటు టైటిల్‌ను నిలబెట్టుకున్నారు. 2019 జనవరిలో అతను గ్రాండ్‌మాస్టర్ గౌరవం పొందాడు.

# ప్రజా సమస్యలపై పోరాడే ఫార్ములే కేటీఆర్ : బాల్కసుమన్

**హైదరాబాద్, డిసెంబర్ 13:** ప్రజా సమ్యస్యల మీద పోరాడే పోరాట ఫార్ములే కేటీఆర్ అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఆశా కార్యకర్తలైన, ఆడబిడ్డల మీద, గురుకుల పసిబిడ్డల ఫుడ్ పాయిజనింగ్ మీద స్పందించి సర్కార్ మెడలు వంచే ఫార్ములే కేటీఆర్ అని తెలిపారు. తెలంగాణ సంస్కృతి మీద జరుగుతున్న దాడులను ప్రశ్నించే ఫార్ములే కేటీఆర్, ఏడాదికాలంగా రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్న మూరపు సీఎం ఆగడాలను,అన్యాయాలను నిలదీస్తున్న నాయకుడే మన కేటీఆర్ అని చెప్పారు. ప్రభుత్వానికి మింగుడుపడని, కొరకరాని కొయ్యగా మారి, ప్రజలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కేటీఆర్‌పై సర్కారు కుట్రలు, కుతంత్రాలకు కొదవలేదని విమర్శించారు. ప్రశ్నించడమే నేరమా, నిలదీయడమే పాపమా? అని ప్రశ్నించారు. లగచర్ల, దిలావర్‌పూర్‌పై, రైతుకు బేడీల మీద, విద్యార్థుల మరణాలపై, గురుకుల సంక్షోభాలపై నిలదీస్తున్నందుకే కేటీఆర్ కుట్రలా అంటూ నిలదీశారు. కిషన్ రెడ్డిని కిస్మత్ రెడ్డి అంటు విమర్శించిన సీఎం రేవంత్.. స్వయంగా వెళ్లి ఆయనకు సన్మానం చేస్తాడని, కిషన్‌రెడ్డి చేయించుకుంటాడని విమర్శించారు.

ప్రజలను అరిగోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతిస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీలో కుస్తీ పడతాయని, తెలంగాణలో మాత్రం దోస్తీ చేస్తాయన్నారు. మీ కుట్రలకు, కుతంత్రాలకు తమ నాయకుడు అదరడు, బెదరడని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటాడని, మీ అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలపై నిలదీస్తూనే ఉంటాడని స్పష్టం చేశారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం




**తొలి సమయం, ఎల్కతుర్తి, డిసెంబర్ 13**

స్థానిక శ్రీ చైతన్య స్కూల్ లో 2023-24 విద్యా సంవత్సరం పదవ తరగతిలో 10/10 జీపిఎ, ఉత్తమ ఫలితాలుసాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడానికి నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని శ్రీ చైతన్య మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ రాజిరెడ్డి అధ్యక్షతన పాఠశాలలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో భాగంగా పూలమాలలు, బహుమ తులు, షీల్డులు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాఠశాల ఏజీఎం పద్మాకర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి సృజనాత్మకతో చదవాలని, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నతమైన స్థానాన్ని చేరుకొని అందరికీ స్ఫూర్తిగా ఉండాలని అన్నారు.జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆనందం ఏ వృత్తిలో లేదని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఒక ప్రణాళిక బద్ధంగా చదువుకొని 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ హంటర్ రోడ్ బ్రాంచ్ ప్రిన్సిపల్ సురేష్, పాఠశాల అకాడమిక్ డీన్ రజనీకాంత్, సీ ఇంచార్జీ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## జమిలీకి జై... త్వరలో పార్లమెంట్‌కు బిల్లు




**తొలి సమయం హైదరాబాద్,**

బీజేపీ ఎజెండాలో ప్రధానమైన వన్ నేషన్ -వన్ ఎలక్షన్ కు సంబంధించి మరో ముందడుగు పడిం ది. వీటికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల ముసాయిదా బిల్లులను ప్రవేశ పెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. దీంతో కీలక బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యం లో 13,14 తేదీల్లో తప్పనిసరిగా సభకు హాజరు కావాలని తమ ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్ జారీ చేశాయి. జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ, దీనిపై ఏకాభిప్రాయం సాధిం చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్ల మెంటరీ కమిటీ (జేపీసి)కి ఈ బిల్లును సిఫార్సు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. దీని ద్వారా వివిధ రాష్ట్రాల శాసనసభ స్పీకర్లతోనూ సంప్రదింపులు జరిపేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం. దీంతోపాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు , అన్ని భాగస్వామ్య పక్షాల కు అవకాశం కల్పించనున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించడంపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో రూపొందించిన నివేదికను భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ ఏడాది మార్చిలో అందించారు. అనంతరం కోవింద్ కమిటీ ఇచ్చిన సిఫార్సులకు కేంద్ర మంత్రివర్గం ఈ సెప్టెంబరు లోనే పచ్చజెండా ఊపింది. తాజా పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని భావిస్తోన్న ప్రభుత్వం, తాజాగా కేంద్ర కేబినెట్‌లో ఆమోద ముద్ర వేసింది.

## మొగుడంపల్లిలో భారీగా డ్రగ్స్ పట్టివేత

**సంగారెడ్డి,డిసెంబర్ 13:**

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లిలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. డ్రగ్స్ తరలిస్తున్నారన్న సమాచా రంతో మొగడంపల్లి మండలం మాడిగి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ లారీ డ్రగ్స్‌ను గుర్తించి వాటిని సీజ్ చేశారు. వాటి విలువ రూ.50 కోట్లు ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓడరేవు నుంచి వాటిని ముంబైకి తరలిస్తున్నారని తెలుస్తున్నది. పట్టుబడిన డ్రగ్స్‌ను చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101